ఆదివారం 31-05-2026
నినాదం
నిర్భీక జర్నలిజం
సాహితీ లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

# ఒక మరణం... దాన్ని అనుకొని పయనించే క్షణాలు!



**ఆకస్మిక శూన్యం**

మరణవార్త చెవిని పడిన ఆ క్షణం...
భూమి ఒక్కసారిగా
ఆగిపోయినట్లుంటుంది.
తలమీద ఆకాశం విరిగిపడ్డా
ఇంతటి భారంగా ఉండదేమో!
నిలువునా ప్రాణం ఉన్నా...
నిశ్చలమైన శిలగా మారిపోతుంది శరీరం.
అది...



నిండు వేసవిలో అకస్మాత్తుగా
ఒక పెనుతుఫాను వచ్చి,
పచ్చని చెట్టును వేళ్లతో సహా
పెకలించివేసినట్లుంటుంది.
ఆకుపచ్చని ఆశలన్నీ క్షణంలో రాలిపోతాయి.
సముద్రపు ఒడ్డున నిలబడినప్పుడు
ఒక పెద్ద అల వచ్చి సర్వస్వాన్నీ లాక్కెళ్లిపోతే,
చేతులు చాచి నిస్సహాయంగా నిలబడే
ఒక పసివాడి ఆవేదనలా మారుతుంది మనసు.
కంటి ముందే ఉంది లోకం... కానీ ఏదీ
కనిపించదు,
చుట్టూ జనం మాట్లాడుతుంటారు...
కానీ ఏ శబ్దమూ వినపడదు.
ఆ క్షణం మనసు...
తీగ తెగిపోయిన వీణలా మూగబోతుంది,
దీపం ఆరిపోయిన గదిలా చీకటైపోతుంది.
ఇది కల అయితే బాగుండనిపించేంతటి
దిగ్భ్రాంతి,
నమ్మలేని నిష్ఠుర సత్యం ముందు
గుండె గొంతుకలోనే నిలిచిపోయి,
కన్నీరు కూడా నైరాశ్యంతో ఘనీభవించే
క్షణమది!

**ఆఖరి ప్రయాణాన్ని సిద్ధం చేసేవేళ...!**

ఒకవైపు...
కన్నవారి, కట్టుకున్నవారి కన్నీటి నదులు
ఇంటి కప్పును దాటి ఆకాశాన్ని తాకుతుంటాయి.
గుండెల్లోంచి ఊడిపడే ఒక్కో రోదన
వాతావరణాన్ని ముక్కలు ముక్కలు
చేస్తుంటుంది.
ఆ ప్రాణం లేని దేహాన్ని పట్టుకుని,
"మమ్మల్ని వదిలి ఎలా వెళ్లావంటూ"
రక్తసంబంధీకులు శోకసంద్రంలో
మునిగిపోతారు.
అదే సమయంలో, అదే గది బయట...
మరో వైపు.... మరొక లోకం
హడావిడిగా కదులుతుంటుంది.
అక్కడ సెంటిమెంట్లు లేవు,
కేవలం ఏర్పాట్లు మాత్రమే ఉన్నాయి.
"పూడ్చాలా? కాల్చాలా?" అనే ప్రశ్నలు
గాలిలో నిర్దయాత్మకంగానే తిరుగుతుంటాయో
నిజాన్నే కఠినంగా పలుకుతున్నట్లో ...
గుండెల్లో గుబుల్ని పెంచేస్తుంటాయి
సొంతూరా? ఉన్న ఊరా? ఎక్కడ
అంత్యక్రియలు?
స్మశానంలో స్థలం దొరుకుతుందా?
పాడె కట్టడానికి కర్రలు వచ్చాయా?
మనుషులు సరిపోయారా?
స్వర్గధామమా
రథం వచ్చిందా?
ముహూర్తం దాటిపోతోందేమో...
క్షణాల వ్యవధిలో వందల ప్రశ్నల హడావిడి!
ఒకవైపు బంధం తెగిపోయిన ఆరాటం,
మరొకవైపు కాలంతో పరిగెత్తే లౌకిక పోరాటం.
దుఃఖించడానికి కూడా
సమయం ఇవ్వని ఆ నిమిషాలు,
మనుషులను నిలువునా ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.
ఆ కన్నీటి రోదనల మధ్య...
ఈ ఏర్పాట్ల కేకలు
మనిషి నిస్సహాయతను వెక్కిరిస్తున్నట్టే...
చివరి శ్వాస ఆగిపోయిన చోట,
కన్నవారి గుండెలు పగులుతుంటే...
లోకం మాత్రం ఆఖరి ప్రయాణపు పనుల్లో
యాంత్రికంగా మునిగిపోయినట్లే ఉంటుంది!

**శూన్యపు పొలిమేరల్లో...**

హడావిడి ముగిసింది... జనం పలచబడ్డారు,
ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.
ఇన్నాళ్లూ ఓదార్చిన చేతులు విడివడి,
ఇల్లు మళ్లీ
నాలుగు గోడల ఏకాంతంలోకి ముడుచుకుంది.
ఇప్పుడు ఆ ఇంట్లో మనిషి లేడు,
ఆ మనిషి వదిలివెళ్లిన
శూన్యం మాత్రమే గోడలకు వేలాడుతోంది.
వాకిట్లో కడిగిన నీళ్లు ఇంకా ఆరనే లేదు,
లోపల గుండెలు మండుతూనే ఉన్నాయి.
అటక మీద ఆయన వాడిన వస్తువులు,
గోడకు తగిలించిన చొక్కా,
కళ్లద్దాలు, కాలేజీ డైరీ, రాసుకున్న కాగితాలు...
అవన్నీ మనిషి లేడనే నిజాన్ని నిలువునా
గుర్తుచేస్తుంటాయి.
సాయంత్రం వేళ... చీకటి పడుతుంటే,
ఆ మనిషి వచ్చే సమయమేమోనని
గుండె ఒక్కసారిగా గట్టిగా కొట్టుకుంటోంది.
తలుపు తట్టేది
కేవలం గాలి మాత్రమేనని తెలిశాక,
కళ్లు మళ్లీ మూగగా నదులవుతాయి.
ఇంటి మూలల్లో ఆ నవ్వుల సవ్వడులు,
మాటల ప్రతిధ్వనులు
ఇంకా వినబడుతూనే ఉంటాయి.
అందరూ ఉన్నా... ఎవరూ లేనట్టు
లోకం నడుస్తున్నా... తమ కాలం
ఆగిపోయినట్టు,
రక్తసంబంధీకులు
ఆ శూన్యంలో దిక్కుతోచక కూర్చుండిపోతారు.
దుఃఖం ఇప్పుడు రోదనగా మారదు,
నిశ్శబ్దపు నిట్టూర్పు అవుతుంది.
అంగీకరించలేని సత్యాన్ని అంగీకరిస్తూ,
ఆ జ్ఞాపకాల బరువును గుండెల్లో దాచుకుంటూ,
మనిషి లేని ఇల్లు
ఒక కొత్త శూన్య జీవితాన్ని
భారంగా అలవాటు చేసుకోవడం
మొదలుపెడుతుంది.

**ముళ్లబాటలూ...**

పూలదండలూ
బంధువులు, స్నేహితులు, తెలిసినవాళ్లు...
ఇల్లు వెతుక్కుంటూ సంతాపం ప్రకటించడానికి
గూగుల్ మ్యాపులడిగేవాళ్ళు
ఇంటిగుర్తులు చెప్పమని విసిగించేవాళ్ళు
తమకి తామే తెలుసుకొని
అడక్కపోయినా ఉక్కబోతని తగ్గించే
మలయవీచికలు
ఓదార్చడానికే అంటారు కానీ...
"అసలు ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది?"
జరిగిందంతా పదేపదే అడిగి
చెప్పించుకుంటారు.
నయమవుతున్న గాయాన్ని మళ్లీ మళ్లీ రేపుతూ,
ఆ ఒక్క రోజూ...
దుఃఖాన్ని విడతలవారీగా కొనసాగింపజేస్తారు.
వచ్చిన వాళ్లలో రకరకాల మనుషులు,
రంగురంగుల దృశ్యాల మాటలు!
కొందరు తాత్కాలిక వైరాగ్యాన్ని ప్రదర్శిస్తూ...
"కాయో పండో కాక తప్పదు,
పుట్టినవాడు గిట్టక తప్పదు"
వల్లమాలిన వేదాంతాన్ని గుప్పిస్తారు.
మరికొందరు...
ఆ మనిషిలోని మంచితనం
మంచుపర్వతంలా మనముందు నిలడెడతారు
"అంత మంచితనం వల్లే
భగవంతుడు తొందరగా తీసేసుకున్నాడు"
ఆ మంచితనాన్నే ఒక శాపంగా మారుస్తారు.
ఇంకొందరు...
తమలో తాము గొణుక్కుంటూ,
ఆసుపత్రి వాళ్లనో,
కాలం కలిసిరాని సమయాన్నో తిడుతూ,
ప్రాణం పోయాక...
పనికిరాని శాపనార్థాలు పెడుతుంటారు.
సంతాపాన్ని యాంత్రికంగా తెలిపే వాళ్ల మధ్యే...
మరికొందరు లౌకికులు ఎదురవుతారు.
"అయిందేదో అయిపోయింది,
ఇక తర్వాత జరగాల్సిన దాన్ని ఆలోచించండి...
ఆడపిల్ల/ మగపిల్లాడో పెళ్లి ఉంది,
చదువు ఉంది..."
భవిష్యత్తు భారాల్ని
ఇప్పుడే నెత్తిపై వేయడానికి సిద్ధపడతారు.
ఒకటేమిటి...
ఎవరి నోటికి వచ్చినట్లు వారు మాట్లాడుతుంటే,
ఆ మాటల రణగొణాల మధ్య...
నిజంగానే సర్వస్వాన్నీ కోల్పోయి
గుండె మరింత మూగగా రోదిస్తుంటుంది.
లోకానికి అది ఒక ఆచారం...
ఒక పలకరింపు కావచ్చు,
ఆ శోక సముద్రంలో మునిగిన వారికి మాత్రం,
ఆ పరామర్శలు...
పూలు చల్లుతూనే
గాయం మీద కారం చల్లినట్టే ఉంటాయి!
కారంచల్లుతూనే
పూలదండలవుతూనే ఉంటాయి!
ఏది ఏమైనా
సంతాపాలన్నీ సంతోషాన్నివ్వకపోయినా
ఉక్కిరిబిక్కిరితో ఊపిరిరాడని క్షణంలో
కాస్త ఓదార్పునిస్తే చాలు!
అవన్నీ నిజమైన జీవితమంటే ఏమిటో
తెలిపే ఉపనిషద్వాక్యాలనేది మాత్రం నిజం!

**కర్మల సుడిగుండం...**

శరీరం బూడిదయ్యాక...
శరీరం భూమిలో కలిసిపోయాకో
శ్మశాన నిశ్శబ్దం ఇల్లు చేరకముందే,
క్యాలెండర్ ముళ్లు తరుముకుంటూ వస్తాయి.
దుఃఖాన్ని కూడా లెక్కల పుస్తకంలోకి నెడుతూ...
"మూడో రోజా? పదో రోజా?"
తిథుల లెక్కలు
గుమ్మం ముందుకొచ్చి నిలబడతాయి.
కన్నీళ్లు ఇంకక ముందే...
'దశదిన కర్మ' భారం భుజాలకెక్కుతుంది.
ఎక్కడ చేయాలి?
సొంత ఇంటిలోనా?
నదీ తీరంలోనా?
ఏదైనా పవిత్ర క్షేత్రంలోనా?
పురోహితులు దొరుకుతారా? చోటు
లభిస్తుందా?
నిర్ణయించాల్సింది మనసు కాదు
నిర్ణయం చెప్పాల్సింది మనము
లోకాచారం!
ఎలా చేయాలి? ఏమేమి చేయాలి?
నియమాల పెద్దలు
ఒక్కొక్కరు ఒక్కో మాట చెప్తారు.
పాలు చల్లాలా? పిండ ప్రదానం చేయాలా?
ఏమేమి సామాగ్రి కొనాలి? ఎవరెవరిని పిలవాలి?
చేయాల్సిన పనుల పట్టిక
ఒక పెద్ద ప్రశ్నార్థకమై నిలుస్తుంది.
ఎవరేమి చేయాలి?
పెద్ద కొడుకా? చిన్న కొడుకా? లేక
రక్తసంబంధీకులా?
కళ్లల్లో కన్నీళ్లతో, వణుకుతున్న చేతులతో,
ఉపవాసాల భారంతో...
ఆ కర్మల పీఠంపై కూర్చోవాలి.
శాస్త్రాల పేరిట చెప్పే గందరగోళ నియమాలను
ఏమీ తెలియని పసివాడిలా పాటిస్తూ
పోవాల్సిందే.
ఒకవైపు...
పోయిన మనిషి జ్ఞాపకాలు గుండెను
పిండేస్తుంటే,
మరొకవైపు...
శాస్త్రం, సంప్రదాయం, బంధువుల అంచనాలు
చుట్టూ చేరి ఊపిరాడకుండా చేస్తాయి.
కన్నవారిని కోల్పోయిన ఆవేదన కంటే,
ఆ కర్మకాండల హడావిడి, ఏర్పాట్ల ఒత్తిడే
మనిషిని నిలువునా కుంగదీస్తుంది.
ఇది... భక్తి కాదు, వైరాగ్యమూ కాదు,
సమాజం కోసం, సంప్రదాయం కోసం...
దుఃఖాన్ని పక్కనపెట్టి,
యాంత్రికంగా చేసే ఒక కన్నీటి పోరాటం!

**మళ్ళీ జీవన స్రవంతిలోకి...!**

కదలిపోయాయి తిథులు...
ముగిశాయి కర్మకాండలు,
ఇంటి ముందు
పందిరిని విప్పేసి పట్టుకెళ్లిపోయారు.
అరిగిపోయిన పలకరింపులు
ఇల్లు మళ్లీ...
కేవలం మన ఇల్లే అయ్యింది.
శూన్యం ఇప్పుడు మరింత స్పష్టంగా,
నిశ్శబ్దంగా కూర్చుంటుంది
కాలం ఎవరి కోసమూ ఆగనంటుంది
ఆకలి తన నైజాన్ని గుర్తుచేస్తూ
పొయ్యి వెలిగించమంటుంది.
పిల్లల పుస్తకాల సంచులు,
స్కూలు బస్సుల హడావిడి,
ఆఫీసు వేళలు, నిత్యజీవితపు అవసరాలు...
అన్నీ వచ్చి తలుపు తడుతుంటాయి.
గుండెల్లో ఒక పెద్ద ఖాళీ
ఎప్పటికీ పూడ్చలేని ఖాళీ అలాగే
ఉండిపోతుంది
ముఖానికి మాత్రం
ఒక పలచటి నిబ్బరాన్నేదో తగిలించుకోక
తప్పదు.
రాని నవ్వుల ప్లాస్టిక్ పూలకు
పరిమళాల్ని గభాళించాలి
ఆ ఫోటోకి పూలదండ వేసి
మా ప్రాణమదేనని భావించాలి
ఆ కళ్లల్లోకి చూస్తూ...
ఒక నిట్టూర్పును దిగమింగుకొంటూ
మళ్లీ లోకంలోకి అడుగుపెట్టాల్సిందే!
నడుస్తున్న రైలు లాంటిదే ఈ జీవన స్రవంతి...
ఒక ప్రయాణీకుడు దిగిపోయాడని
రైలు ఆగిపోదు కదా!
మిగిలిన వాళ్లం
ప్రయాణం కొనసాగించాల్సిందే.
కన్నీళ్లను తుడుచుకుంటూనే...
మళ్లీ కలం పట్టాల్సిందే!
బాధ్యతల రథాన్ని
భారంగానైనా ముందుకు లాగాల్సిందే!
ఆ మనిషి లేని లోటు...
ప్రతి అడుగులోనూ తగులుతూనే ఉంటుంది
చేసే ప్రతి పనిలోనూ
ఆ నీడ కనిపిస్తూనే ఉంటుంది.
గాయంతోనే బ్రతకడం
ఆ శూన్యంతోనే నడవడం
ఇక అలవాటైపోతుంది!
దుఃఖం ఒక నది
జీవితం ఒక సముద్రం
మళ్లీ ఆ జీవన స్రవంతిలో కలిసిపోవడమే...
మనం ఆ వెళ్లిన మనిషికి ఇచ్చే నిజమైన నివాళి!

**బంధాల వెనుక... లెక్కల తెరలు**

కళ్లల్లో కన్నీళ్లు ఇంకా తడి ఆరనే లేదు,
పోగుచేసిన జ్ఞాపకాల వాసన ఇల్లంతా పోనే
లేదు.
అప్పుడే గాలిలోకి వచ్చి చేరుతాయి
ఆర్థిక లావాదేవీల లెక్కల కాగితాలు.
మనిషి జ్ఞాపకాల కంటే
ఆ మనిషి వెనుక
వదిలివెళ్లిన ఆస్తిపాస్తుల లెక్కలు
బ్యాంకు ఖాతాలు, సంతకాలు, నామినేషన్లు...
ఇన్సూరెన్స్ కాగితాలు, పెంకుటింటి హద్దులు...
ఒక్కొక్కటిగా టేబుల్ మీదికి వస్తుంటాయి.
ఇన్నాళ్లూ
ప్రేమానురాగాలను కురిపించిన బంధుత్వాలు,
ఇప్పుడు
హక్కుల కోసం వాదించే లాయర్లుగా
మారిపోతాయి.
" ఎవరికెంత బాకీ ఉన్నారో?
ఎవరికెంత ఇవ్వాలి?"
"ఆ సంపాదనలో ఎవరి వాటా ఎంత?"
ఈ ప్రశ్నలు మొదలైన క్షణమే...
ఇంటి వాతావరణంలో
కమ్ముకొనే మనస్పర్థల దట్టమైన పొగ
మాటల వెనుక దాగున్న సున్నితత్వం మాయమై,
స్వరాలు కరుకుగా, అనుమానంగా
మారిపోతాయి.
ఒకరి ముఖం ఒకరు చూసుకోవడానికి కూడా
అహం అడ్డువచ్చి గోడలు కడుతుంది.
రక్తసంబంధమని చెప్పుకున్న నోళ్లే...
పైసల లెక్కల దగ్గర
పరాయి వాళ్లలా వాదించుకుంటాయి.
పోరాడి సాధించుకోవడానికి
ఆస్తులు ఉంటాయి గానీ
పోయిన మనిషిని తెచ్చుకోవడానికి
ఏ దారీ లేదనే నిజాన్ని
ఆ స్వార్థపు హడావిడిలో అందరూ
మర్చిపోతారు.
నిజమైన దుఃఖం...
ఒక మూలన కూర్చుని నిశ్శబ్దంగా ఏడుస్తుంటే,
లోకం మాత్రం...
మనిషి విలువను కాకుండా,
ఆ వ్యక్తి వదిలివెళ్లిన అంకెల విలువను కడుతూ
బంధాలను ముక్కలు ముక్కలు చేసుకుంటుంది.



- డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్,
ఫోన్: 9989628049

ఆదివారం 31-05-2026

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# సాహితీ లహరి

Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064



కిన్నెర ఆర్ట్ థియేటర్స్, వాసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి డా॥ వాసా ప్రభావతి శాస్త్రి జయంతి సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త, పరిశోధకుడు, విమర్శకుడు, ప్రస్తుతం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా సేవలందిస్తున్న ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారికి "డా. వాసా ప్రభావతి జీవిత సాఫల్య ప్రతిభాపురస్కారం" ప్రదానం చేయడం తెలుగు సాహిత్య ప్రపంచానికి గర్వకారణం. ఈ పురస్కారం ఒక వ్యక్తికి లభించిన గౌరవం మాత్రమే కాదు; తెలుగు భాషా-సాహిత్యాలకు ఆయన చేసిన నిరంతర సేవలకు సమాజం తెలిపిన సాహిత్యాభివందనం. "సాహిత్యాన్ని సాధనగా, పరిశోధనను జీవనవ్రతంగా, భాషను సంస్కృతి స్వరూపంగా భావించిన అరుదైన సాహిత్య మేధావి ఆచార్య వెలుదండ నిత్యానందరావు. తెలుగు సాహిత్య విమర్శ, పరిశోధన, సృజనాత్మక రచన, భాషా చింతన రంగాల్లో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా డా॥ వాసా ప్రభావతి జీవిత సాఫల్య ప్రతిభాపురస్కారం లభించడం తెలుగు అక్షర ప్రపంచానికి గర్వకారణం.

# సమగ్ర సాహిత్య ప్రస్థానానికి గౌరవాభినందనం

సురవరం ప్రతాపరెడ్డి
తెలుగు విశ్వవిద్యాలయం
ఉపకులపతి

## ఆచార్య వెలుదండ నిత్యానందరావుకు వాసా ప్రభావతి జీవిత సాఫల్య పురస్కారం






తెలుగు సాహిత్య చరిత్రలో కొందరు రచయితలు ఒకే ప్రక్రియకు పరిమితం కాకుండా అనేక ప్రక్రియల్లో తమ మేధస్సును విస్తరింపజేస్తారు. వారు కేవలం గ్రంథాలను రచించరు; ఒక సాహిత్య దిశను నిర్మిస్తారు. వారి రచనల్లో ఒక యుగ చైతన్యం, ఒక సంస్కృతి స్పృహ, ఒక పరిశోధనా ప్రవాహం, ఒక మానవీయ దృష్టి కలిసి కనిపిస్తాయి. అలాంటి విశిష్ట సాహిత్య వేత్తల్లో ఆచార్య నిత్యానందరావు గారు ప్రముఖులు. పరిశోధకుడు, విమర్శకుడు, వ్యాసకర్త, భాషా చింతకుడు, సృజనాత్మక రచయిత, వ్యక్తిత్వ విశ్లేషకుడు, హాస్యరచయిత, ఉపన్యాసకుడు, పరిపాలనా దక్షత కలిగిన విద్యావేత్తగా ఆయన తెలుగు ప్రపంచంలో విశిష్ట స్థానం సంపాదించుకున్నారు. ఆయన రచనలు చదివితే కేవలం సాహిత్యానుభూతి మాత్రమే కాదు; సాహిత్యాన్ని ఎలా అధ్యయనం చేయాలి? ఎలా విశ్లేషించాలి? ఎలా అనుభవించాలి? అనే విషయాలపై ఒక సమగ్ర దృక్పథం లభిస్తుంది. తెలుగు భాషా-సాహిత్యాలను ఆయన కేవలం పాండిత్య ప్రదర్శన కోసం అధ్యయనం చేయలేదు. సమాజ చైతన్యానికి, సంస్కృతి పరిరక్షణకు, మానవీయ విలువల వికాసానికి సాహిత్యం ఒక సాధనమని ఆయన విశ్వసించారు. అందువల్ల ఆయన రచనల్లో ఎక్కడ చూసినా జ్ఞానం, విలువలు, సంస్కృతి, పరిశోధన, భాషా సౌందర్యం, భావుకత సమన్వయమై కనిపిస్తాయి. ఆచార్య నిత్యానందరావు గారి సాహిత్య సేవలను సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే "సమగ్ర సాహిత్యం" పేరిట వెలువరించిన ఆయన ఏడు సంపుటాలను పరిశీలించాల్సిందే. ఈ సంపుటాలు కేవలం రచనల సమాహారం కాదు; ఒక సాహిత్య మేధావి ఆలోచనా ప్రపంచానికి అద్దం పట్టే అక్షర సాక్ష్యాలు.

**"అనుభూతి-అన్వేషణ" సంపుటిలో** ఆయన విమర్శనా దృష్టి అత్యంత గంభీరంగా వ్యక్తమవుతుంది. సాహిత్యాన్ని కేవలం కథాంశం లేదా భావవ్యక్తీకరణ స్థాయిలో చూడకుండా దాని అంతరార్థాలను, కాలపరమైన నేపథ్యాన్ని, సామాజిక సందర్భాన్ని, సాహిత్య విలువలను విశ్లేషించే ప్రయత్నం ఈ గ్రంథంలో కనిపిస్తుంది. ఈ సంపుటిలోని సమీక్షలు ఒక పుస్తకాన్ని మెచ్చుకోవడం లేదా విమర్శించడం అనే పరిమితిని దాటి దాని సాహిత్యాత్మను వెలికితీసే స్థాయికి చేరుకున్నాయి. ఆయన పీఠికలు ప్రత్యేక ప్రస్తావనకు అర్హమైనవి. సాధారణంగా పీఠికలు ఒక గ్రంథానికి ముందుమాటలుగా ఉంటాయి. కానీ ఆచార్యుని పీఠికలు స్వతంత్ర విమర్శా వ్యాసాలుగా నిలుస్తాయి. రచయిత వ్యక్తిత్వం, రచన వెనుక ఉన్న ఆలోచనా ధోరణి, సాహిత్య చరిత్రలో ఆ రచన స్థానం వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషిస్తూ ఆయన పీఠికలు సాగుతాయి. అందువల్ల అవి సాహిత్య అధ్యయనానికి విలువైన ఆధారాలుగా నిలుస్తాయి.

**"అక్షరమాల" సంపుటిలో** ప్రముఖ సాహితీవేత్తలు, మేధావులు, సంస్కృతిక ప్రముఖుల వ్యక్తిత్వాలను ఆయన ఎంతో మానవీయంగా చిత్రించారు. ఈ రచనలు కేవలం జీవిత చరిత్రలు కావు; అవి వ్యక్తిత్వ విశ్లేషణలు. వ్యక్తి జీవితం వెనుక ఉన్న విలువలు, ఆలోచనా విధానం, సమాజంపై చూపిన ప్రభావం, సాహిత్య దృక్పథం వంటి అంశాలను ఆయన లోతుగా విశ్లేషించారు. ఆచార్యుని దృష్టిలో ప్రతి వ్యక్తి ఒక అక్షరం. ఆ అక్షరాల సమాహారమే సమాజ సాహిత్య సంస్కృతి. అందుకే "అక్షరమాల" అనే శీర్షిక ఎంతో సార్థకంగా నిలిచింది. వ్యక్తిత్వ చిత్రణలో ఆయన చూపిన సమతుల్యత, గౌరవభావం, మానవీయ దృష్టి ఈ గ్రంథాన్ని ప్రత్యేక స్థాయికి చేర్చాయి.



**"వాగ్దేవి వరివస్య"లో** తెలుగు భాషా-సాహిత్యాలపై ఆయనకు ఉన్న లోతైన పాండిత్యం ప్రతిఫలిస్తుంది. తెలుగు భాషా వైభవం, పదసంపద, వ్యాకరణ పరిమళం, సాహిత్య ప్రక్రియల పరిణామం, విమర్శా సిద్ధాంతాలు వంటి అనేక అంశాలపై ఆయన పరిశోధనాత్మకంగా వ్యాసాలు రచించారు. తెలుగు భాషను ఆయన కేవలం సంభాషణ సాధనంగా చూడలేదు; అది సంస్కృతి యొక్క జీవరక్తమని భావించారు. అందువల్ల ఆయన రచనల్లో భాష పట్ల అపారమైన గౌరవం కనిపిస్తుంది. సంప్రదాయ భాషా సౌందర్యాన్ని కాపాడుతూనే ఆధునిక భాషా చైతన్యాన్ని స్వీకరించిన ఆయన దృష్టి విశిష్టమైనది. పాండిత్యం ఉన్నప్పటికీ క్లిష్టత లేకుండా సాధారణ పాఠకుడికి కూడా అర్థమయ్యే రీతిలో విషయా లను వివరించడం ఆయన ప్రత్యేకత.



**"పరిశోధకప్రభ" సంపుటి** ఆయన పరిశోధనా వైభవానికి నిదర్శనం. "చంద్రరేఖావిలాపం" వంటి ప్రాచీన సాహిత్య అంశాల పై చేసిన విశ్లేషణ ఆయన సంప్రదాయ సాహిత్యంపై ఉన్న పట్టు తెలియజేస్తుంది. "తెలుగు సాహిత్యంలో పేరడీ" వంటి అంశంపై ఆయన చేసిన పరిశోధన తెలుగు విమర్శా రంగంలో ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంది. పేరడీని కేవలం వినోదాత్మక ప్రక్రియగా కాకుండా ఒక విమర్శా సాధనంగా ఆయన విశ్లేషించారు. పేరడీ వెనుక ఉన్న సామాజిక నేపథ్యం, సాహిత్య ఉద్దేశం, కళాత్మకత వంటి అంశాలను శాస్త్రీయంగా పరిశీలిం చారు. "పరిశోధనాంతరంగం"లో పరిశోధకుడి అంతర్ముఖ ప్రపంచం కనిపిస్తుంది. పరిశోధన అనేది కేవలం సమాచార సేకరణ కాదని, అది ఒక సాధన, ఒక ఆత్మాన్వేషణ అని ఆయన భావజాలం వ్యక్తమవుతుంది.

**"వ్యాసశేముషి"లో** సంప్రదాయ సాహిత్యంపై ఆయనకు ఉన్న అపారమైన అవగాహన స్పష్టమవుతుంది. పూర్వ కవుల కవిత్వం, ప్రబంధ సాహిత్యం, రససిద్ధాంతాలు, అలంకార శాస్త్రం వంటి అంశాలను ఆయన లోతుగా విశ్లేషించారు. సంప్రదాయ సాహిత్యాన్ని కేవలం ఆరాధించడం కాదు; ఆధునిక దృష్టితో పునర్వ్యాఖ్యానం చేయడం ఆయన ప్రత్యేకత. "హాస విలాసం"లో ఆయన హాస్యచతురత ప్రత్యేకంగా కనిపిస్తుంది. హాస్యాన్ని ఆయన వినోదంతో పాటు సామాజిక విమర్శకు సాధనంగా ఉపయోగించారు. వ్యంగ్యోక్తులు, చమత్కార భాష, సరసమైన వ్యాఖ్యాన శైలి ఈ రచనలకు ప్రత్యేక ఆకర్షణ.

**"సృజనానందం" లో** ఆయన సృజనాత్మక ప్రపంచం మన ముందుకు వస్తుంది. నాటికలు, కవితలు, కథలు, లేఖలు, లఘు వ్యాఖ్యల ద్వారా ఆయనలోని భావుకత, మానవీయత, సామాజిక చైతన్యం వ్యక్తమవుతాయి. విమర్శకుడిగా మాత్రమే కాకుండా సృజనకర్తగా కూడా ఆయన ఉన్నత స్థాయిని చేరుకున్నారని ఈ సంపుటి నిరూపిస్తుంది. నాటికల్లో సామాజిక సమస్యల పట్ల చైతన్యం కనిపిస్తే, కవిత్వంలో భావుకత, తాత్త్వికత, భాషా లయసమన్వయమవుతాయి. కథల్లో సాధారణ మనుషుల జీవితాన్ని సాహిత్యాత్మకంగా చిత్రించారు. లేఖలు, లఘు వ్యాఖ్యల్లో ఆయన వ్యక్తిత్వంలోని సహజత్వం, హృదయస్పందన స్పష్టమవుతాయి.

**"ఆదర్శపథం"లో** జాతీయ చైతన్యం ప్రతిఫలిస్తుంది. బంకించంద్ర వంటి జాతీయ రచయితను, బూర్గుల రామకృష్ణారావు వంటి ప్రజానాయకుడిని ఆయన చారిత్రక, సామాజిక, సాహిత్య దృష్టులతో విశ్లేషించారు. జాతీయత, సంస్కృతి, ప్రజాసేవ, సామాజిక బాధ్యత వంటి అంశాలు ఈ రచనల్లో ప్రధానంగా కనిపిస్తాయి. చరిత్రను కేవలం గతస్మృతిగా కాకుండా వర్తమానానికి మార్గదర్శ కంగా చూడగలిగిన దృష్టి ఆయనలో స్పష్టమవుతుంది.

ఆచార్య నిత్యానందరావు గారి సాహిత్య వ్యక్తిత్వంలో అత్యంత విశిష్టమైన అంశం ఆయన బహుముఖ ప్రజ్ఞ. విమర్శలో విశ్లేషణాత్మకత,



పరిశోధనలో ఆధారబద్ధత, భాషా వ్యాసాల్లో పాండిత్యం, సృజనాత్మక రచనల్లో భావుకత, హాస్య రచనల్లో చమత్కారం, వ్యక్తిత్వ చిత్రణల్లో మానవీయత ఆయన రచనలను ప్రత్యేక స్థాయికి చేర్చాయి. సంప్రదాయం-ఆధునికతల సమన్వయం ఆయన సాహిత్యానికి ప్రధాన లక్షణం. పూర్వ సాహిత్య సంపదను గౌరవిస్తూ ఆధునిక చైతన్యాన్ని ఆహ్వానించిన అరుదైన సాహితీ వేత్తగా ఆయన గుర్తింపు పొందారు. ప్రస్తుతం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఉన్న ఆయన తెలుగు భాషా--సాహిత్యాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. జానపద సాహిత్యం, గిరిజన సాహిత్యం, పరిశోధన, భాషా అధ్యయనం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ వంటి రంగాల్లో ఆయన నాయకత్వం విశేష ప్రాధాన్యతను సంతరిం చుకుంది. తెలుగు సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే సంకల్పం ఆయన ఆలోచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఉపకులపతిగా ఆయన పాత్ర కేవలం పరిపాలనకే పరిమితం కాలేదు. అది ఒక సాహిత్య చైతన్య ఉద్యమంగా మారింది. డా॥ వాసా ప్రభావతి జీవిత సాఫల్య ప్రతిభాపురస్కారం ఆచార్య నిత్యానందరావు గారికి రావడం అత్యంత సముచితం. ఎందుకంటే ఆయన సాహిత్య సేవ కేవలం రచనల పరిమితిలో నిలిచిపోలేదు. అది ఒక అక్షరయజ్ఞంగా మారింది. ఆయన రచనలు పరిశోధకులకు మార్గదర్శకాలు, విద్యార్థులకు అధ్యయన గ్రంథాలు, సాహిత్యాభిమానులకు జ్ఞాననిధులు. తెలుగు సాహిత్య విమర్శకు, పరిశోధనకు, భాషా చైతన్యానికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. తెలుగు భాషా-సాహిత్యాలకు అంకితభావంతో సేవ చేస్తున్న మహోన్నత సాహితీవేత్తగా ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. "ఈ పురస్కారం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు. తెలుగు భాషా ,సాహిత్యాల పట్ల జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన ఒక అక్షరతపస్వికి సమాజం సమర్పించిన సాహిత్య వందనం.

డా.ఇడికోజు శ్రీనివాసాచారి
తెలుగు అధ్యాపకులు, విమర్శకులు
9885349305

